యూరియా సరఫరా చేయాలి

టెక్కలి రూరల్ : ఆరుగాలం శ్రమటోడ్చి... కష్టపడి పొలంలో పనిచేయాల్సిన రైతన్నలు రోడ్లెక్కి ఎరువుల కోసం ఎదురు చూడడం బాధాకరమని వైసిపి నియోజక వర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. పట్టణంలో ఎరువుల షాపుల యజమానుల వద్దకు మంగళవారం వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువుల కోసం దుకాణాల ముందు పడిగాపులు కాస్తున్న రైతులను చూస్తే మనసు కలచివేస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదన్నారు. రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో టిడిపి ప్రభుత్వం దారుణంగా వైఫల్యం చెందిందని ఆరోపించారం. దీనికి ప్రధాన కారణం కూటమి నాయకులు ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించడమేనని విమర్శించారు. సొసైటీలకు, దుకాణాలకు వస్తున్న ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా రైతన్నలకు విరివిగా అందజేయాలని కోరారు. ఇప్పటికైనా రైతాంగానికి అవసరమైన ఎరువులు సరఫరా అయ్యే విధంగా కూటమి ప్రభుత్వ నాయకులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దంచికొట్టిన వాన

శ్రీకాకుళం పెద్దపాడు సమీపంలో జాతీయ రహదారిపై చేరిన వరద నీరు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. శ్రీకాకుళంలో కురిసిన కుండపోత వర్షానికి నగరం జలమయం మయ్యింది. ప్రధాన రోడ్లు, వీధులను వర్షపు నీరు ముంచెత్తింది. శ్రీకాకుళం, గార, నరసన్నపేట, ఆమదాలవలస ప్రాంతాల్లో పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. పెద్దపాడు సమీపంలోని జాతీయ రహదారిపై రెండడుగుల మేర వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అల్పపీడన ప్రభావంతో శ్రీకాకుళం డివిజన్‌లో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాలు కురుసున్న నేపథ్యంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను అప్రమత్తం చేశారు.

- కుండపోత వర్షంతో శ్రీకాకుళం నగరం జలయమయం
- పెద్దపాడు వద్ద జాతీయ రహదారిపై రెండడుగుల మేర నీరు చేరిక
- వాహనాల రాకపోకలకు అంతరాయం
- పలు ప్రాంతాల్లో నీటి మునిగిన పంట పొలాలు
- వర్షాలపై మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు దిశా నిర్దేశం

శ్రీకాకుళం ఆర్‌టిసి ముఖద్వారం వద్ద అవస్థలు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

అల్పపీడన ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదయింది. శ్రీకాకుళంలో అత్యధికంగా 52.4 మి.మీ వర్షం పడింది. ఎచ్చెర్లలో 28.8 మి.మీ, ఆమదాలవలసలో 23 మి.మీ వర్షం కురిసింది. మందసలో అత్యల్పంగా 1.8 మి.మీ వర్షపాతం నమోదయింది. జిల్లాలో సగటున 12.6 మి.మీ వర్షపాతం నమోదయింది. శ్రీకాకుళం నగరంలో అర్ధరాత్రి నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎడతెరిపిలేని వర్షం కురవడంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్లు, కాలువలు ఏకమయ్యాయి. ప్రధాన రోడ్లలో సైతం భారీగా వరద నీరు ప్రవహించింది. అత్యంత రద్దీగా ఉండే డే అండ్ నైట్ కూడలి నుంచి రైతు బజారు రోడ్లులో భారీ వరద నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని బర్మా కాలనీ, విశాఖ-ఎ కాలనీ, బి కాలనీ, చిన్న బరాటం వీధి, తదిరత ప్రాంతాలను వరద నీరు ముంచెత్తింది. హడ్కో కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో మహిళలు నీటి తోడుతూ అవస్థలు పడ్డారు. ఇల్లీసిపురం, చౌక బజార్, పొట్టిశ్రీరాములు మార్కెట్ ఏరియా తదితర ప్రాంతాల్లో రోడ్లపై భారీగా వరద నీరు ప్రవహించింది. పిఎన్ కాలనీ, ప్రేమ సమాజం రోడ్ చెరువును తలపించింది. రైతుబజారు నీట మునగడంతో కూరగాయాల అమ్మకాలకు ఇబ్బంది ఏర్పడింది. కొనుగోలుదారులు తీవ్ర అవస్థలు పడ్డారు.

చిరు వ్యాపారి అవస్థలు

శ్రీకాకుళం శివారు ప్రాంతాలనూ ముంచెత్తిన వాన

కుశాలపురం బైపాస్ నుంచి ఏడు రోడ్ల కోడలి వరకు రోడ్డు పూర్తిగా పాడయింది. సింహద్వారం నుంచి డే అండ్ నైట్ వరకు రోడ్డుపై తారు రోడ్ లేయర్లు ఊడిపోయాయి. శ్రీకాకుళం నగరం విలీన పంచాయతీ తోటపాలెం పరిధిలో అందవరపు తవితయ్య నగర్‌లో సైతం నీరు నిలిచిపోయింది. శ్రీకాకుళం మండలం చాపురంలోనూ ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. పెద్దపాటు గాంధీనగర్ కాలనీలోని వీధులన్నీ నీట మునిగి ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో గృహోపకరణాలు తడిసి పాడైపోయాయి.

నీట మునిగిన ఆర్‌టిసి కాంప్లెక్స్

శ్రీకాకుళం నగరంలో అర్ధరాత్రి నుంచి ఏకధాటిగా కురుసున్న వర్షాలకు ఆర్‌టిసి కాంపెక్సు నీట మునిగింది. కాంప్లెక్సు ప్రాంగణాన్ని వర్షపు నీరు ముంచెత్తింది. రెండడుగుల మేర నీరు నిలిచిపోయింది. నాన్‌స్టాప్ కౌంటర్, ప్రయాణికులు కూర్చొనే ప్రాంతాల్లో సైతం వర్షపు నీరు ప్రవాహించింది. వర్షపు నీటిలోనే రాకపోకలు సాగిస్తూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం

శ్రీకాకుళం మండలం పెద్దపాడు సమీపంలో రహదారిపై మూడడుగుల వరద ప్రవహించడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న కల్వర్టు మూసుకుపోవడంతో సమీప ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద నీరు జాతీయ రహదారిపై చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడకు చేరుకుని వాహనాలను సర్వీస్ రోడ్డు నుంచి మళ్లించారు.

ముంపు సమస్యపై

పోలాకి మండలం సుసరాం సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

కేంద్ర, రాష్ట్ర మంత్రుల అసహనం

శ్రీకాకుళం నగరంలో పలు రహదారులు, ప్రధాన కూడళ్లలో వర్షపు నీరు ముంచెత్తడంపై కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులను స్థానిక ప్రజాసదన్‌కు పిలిపించి మాట్లాడారు. కాలువల్లో పూడిక తీయకపోవడం వల్లే ఈ సమస్య తలెత్తిందని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెద్దపాటు జాతీయ రహదారిపై భారీ వరద నీరు చేరడంపై హైవే అధికారులతో మంత్రి రామ్మోహన్ నాయుడు ఫోన్‌లో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.

అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి

జిల్లాలో ఎడతెరిపి లేని వర్షాలు నేపథ్యంలో వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను అప్రమత్తం చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చూడాలని సూచించారు. చెరువులు, కాలువలు గండ్లు పడకుండా ఎప్పుడికప్పుడు పర్యవేక్షించాలని నీటి పారుదలశాఖ అధికారులకు సూచించారు. ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించాలని వ్యవసాయశాఖ అధికారులకు దిశానిర్ధేశం చేశారు.

పోలాకి, నరసన్నపేటలోని పలు ప్రాంతాలు జలమయం

పోలాకి పంచాయతీ విశ్వేశ్వర నగర్ కాలనీని వర్షపు నీరు ముంచెత్తింది. ఇళ్ల చుట్టూ భారీగా వర్షపు నీరు చేరింది. నరసన్నపేట మార్కెట్, కాంప్లెక్స్ ప్రాంగణంలో భారీగా వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలోని పాతినవారి వీధి, పూజారిపేట, కంద్రపేట, రైల్వే గేటు, మెట్టెక్కివలస తదితర ప్రాంతాలను వర్షపు నీరు ముంచెత్తింది.

నీట మునిగిన వరి చేలు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నరసన్నపేట మండలం జమ్ము, గొట్టిపల్లి, ఉర్లాం, నడగాం, చిక్కాలవలస, మామిడివలస, సుందరాపురం తదితర గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. గార మండలం తోణంగి సమీపంలో పంట కాలువ పొంగిపొర్లడంతో సమీపంలోని పంట పొలాలు నీటి మునిగాయి.

జిల్లాలో వర్షపాతం వివరాలు

మండలం	కురిసిన వర్షం (మి.మీల్లో)
ఎచ్చెర్ల	28.8
సంతబొమ్మాళి	19.6
టెక్కలి	17.6
గార	11.8
లావేరు	18.6
రణస్థలం	15.2
హిరమండలం	7.0
పాతపట్నం	3.2
నరసన్నపేట	18.2
సారవకోట	2.8
జి సిగడాం	8.6
శ్రీకాకుళం	52.4
బూర్జ	4.6
కొత్తూరు	2.4
ఆమదాలవలస	23.0
సరుబుజ్జిలి	10.2
కంచిలి	5.0
ఎల్ఎన్‌పేట	4.2
మెళియాపుట్టి	1.8
పోలాకి	13.4
నందిగాం	5.6
కోటబొమ్మాళి	17.6
పొందూరు	3.2
జలుమూరు	22.8
వజ్రపుకొత్తూరు	7.6
పలాస	9.2
ఇచ్ఛాపురం	12.0
కవిటి	8.4
సోంపేట	3.6
మందస	1.8

వ్యవసాయ శాఖ అధికారిని నిలదీస్తున్న సభ్యులు

రైతు కష్టాలు పట్టవా?

వంశధార, ఎరువుల కొరతపై సభ్యుల ఆగ్రహం

ప్రజాశక్తి- పలాస

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో వంశధార నీరు అందలేదని, ఎరువులు కోసం రైతులు కష్టాలు పడుతున్నా అధికారులు ఏమి చేస్తున్నారని మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉంగ సాయికృష్ణ, అమలకుడియా సర్పంచ్ కొర్ల శిరీష, ఎంపిటిసిలు బమ్మిడి దుర్యోధన, గొండు మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండల మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తుందని, వ్యాపారులు ఎరువులను బ్లాక్ చేస్తున్నారని, ఇలా అయితే రైతులు వ్యవసాయం ఎలా చేస్తారని వ్యవసాయ శాఖ ఎఒ పోలారావును ప్రశ్నించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంశధార కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు నీరు చేరిందని, ఇది వంశధార కాదని, వర్షాధార అవునా? కాదా? అంటూ వంశధార ఎఇఇ మీనాక్షిని నిలదీశారు. సర్పంచ్ కొర్ల శిరీష మాట్లాడుతూ పంచాయతీలకు ఏడు నెలలుగా నిధులు విడుదల చేయకుండా వరిపాలన ఎలా చేయాలని ప్రశ్నించారు. గత సమావేశంలో చెప్పిన నమస్యను ఈ సమావేశానికీ వరిష్కరించకపోతే సమావేశాలకు రావడం ఎందుకని ప్రశ్నించారు. బొడ్డపాడు, లక్ష్మీపురం ఎంపిటిసిలు మాట్లాడుతూ తాగునీటి సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ధనుంజయను ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రవికుమార్, ఎంపిడిఒ కె.వనంతకుమార్, డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, వైస్ ఎంపిపిలు తలగాన శ్రీరాములు, నవర దాలమ్మ, సర్పంచ్‌లు బాడాన పుష్పలత, తామాడ మదన్, బొతంన రాజేశ్వరి, దువ్వాడ వామాక్షి కొర్ల సంతోష్, ఎంపిటిసి మద్దిల పొపారావు పాల్గొన్నారు.

శ్రమించే వారికే పదవులు

హోంమంత్రి అనిత

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

టిడిపి కోసం పనిచేసిన వారికి పదవులు దక్కుతాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ పదవుల కోసం ఎంపిక ప్రక్రియపై మంగళవారం సమావేశం నిర్వహించారు. పరిశీలకురాలుగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ కోసం శ్రమించిన వారి శ్రమకు గుర్తింపు ఉంటుందని అన్నారు. పార్టీ భవిష్యత్ కోసం శ్రమించే చురుకైన వ్యక్తుల అవసరం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో సమర్థుల ఎంపిక చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యాన టిడిపి బలోపేతం లక్ష్యంగా చెప్పారు. కార్యకర్తలు, నాయకులు సమిష్టి అభిప్రాయాన్ని గౌరవిస్తూ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం లక్ష్యంగా పనిచేయాలన్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ ఇంకా బలోపేతం కావాలన్నారు. స్థానిక ఎన్నికల్లో విజయం లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గుండు శంకర్, బొగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న హోంమంత్రి అనిత

జెడ్‌పిలో ఐదుగురికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం జిల్లా ప్రజా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న ఐదుగురు రికార్డు సహాయకులు జూనియర్ సహాయకులుగా ఉద్యోగోన్నతి పొందారు. జిల్లా ప్రజా పరిషత్ అధికారిక వసతిగృహంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ఉత్తర్వులను అందజేశారు. మురపాక పాఠశాలలో పనిచేస్తున్న డి.రమాదేవి, లింగలవలస పాఠశాలలోని కె.హేమలత, గోవిందపురం పాఠశాలలోని పి.జయలక్ష్మి, బోరుభద్ర పాఠశాలలోని ఎ.గోపాలరెడ్డి, ఫరీదుపేట పాఠశాలలోని కె.పద్మలతలు ఉద్యోగోన్నతులు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధ్యతల్లో నిబద్ధతతో పనిచేసి జిల్లా ప్రజా పరిషత్‌కు మంచి పేరు తెచ్చిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజ, డిప్యూటీ సిఇఒ డి.సత్యనారాయణ, సి సెక్షన్ సిబ్బంది, ఉద్యోగోన్నతి పొందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందుకున్న వారితో విజయ

మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి

పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పర్యావరణానికి మట్టి వినాయకులు మేలు చేస్తాయని, గణేశ్ చతుర్థి పండగ వేడుకలు పర్యావరణహితంగా నిర్వహించుకోవాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రజా సదన్‌లో మంగళవారం పర్యావరణ ఇంజినీర్ బి.కరుణశ్రీ అందజేసిన మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను వాడటం ద్వారా నదీ జలాలు కలుషితం కాకుండా కాపాడవచ్చని అన్నారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఇంటి వద్దకే మట్టి విగ్రహాలు డెలివరీ అవుతాయన్నారు. మన భక్తిని ఆచరిస్తూనే పర్యావరణాన్ని కాపాడుకుందామని అధికారులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యాన మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

అచ్చెన్న శుభాకాంక్షలు

జిల్లా ప్రజలందరికీ రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, శ్రేయస్సు నింపాలని ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతోందని అన్నారు. ఈ పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, ప్రజల మధ్య శాంతి, ఐక్యతను పెంపొందించే వేదిక కావాలని ఆకాంక్షించారు. గణపతి నవరాత్రోత్సవాలను ప్రజలంతా సుహృద్భావ వాతావరణంలో నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు.

ఎస్‌పి...

సుఖశాంతులతో ఆనందమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ప్రజలందరికీ వినాయక చవితి శభాకాంక్షలు తెలియజేశారు.

మత్స్యకారుల జీవనోపాధి భద్రతకు కృషి

స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

తీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధి భద్రతను పెంచేందుకు కృషి చేస్తున్నామని టెక్కలి మత్స్యశాఖ అధికారి ధర్మరాజ్ పాత్రో అన్నారు. మండలంలోని మరువాడ తీర ప్రాంతంలో గ్రీన్ క్లైమేట్ ఫండ్ టీం ఇసిఆర్‌విసిసి ప్రాజెక్టు బృందం మంగళవారం సందర్శించింది. ఈ సందర్భంగా మత్స్యకారులతో బృందం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ బృందం సభ్యులు మాట్లాడుతూ ప్రతికూల వాతావరణ పరిస్థితులను అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు వివిధ ఉపాధి మార్గాలను మత్స్యకారులకు సూచించారు. సముద్రపు నాచు (సీవీడ్) సాగు, అలంకరణ చేపల పెంపకం, ఆల్చిప్పల పెంపకం, పీతల పెంపకం వంటి కార్యకలాపాల ద్వారా మత్స్యకార కుటుంబాల ఆదాయం పెరగవచ్చని వివరించారు. ఈ రంగాల్లో ఉచిత శిక్షణతో పాటు ఆర్థిక సహకారం అందిస్తామని ప్రకృతి వనరుల నిర్వహణ నిపుణుడు మహమ్మద్ రఫీ తెలిపారు. కార్యక్రమంలో లైవ్‌లిహుడ్ అసోసియేట్ జి.సుబ్బారావు, ఎపిడి, ఎపిఒ నరసింహమూర్తి, సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాస్‌రాజు, మత్స్యకార సొసైటీ ప్రెసిడెంట్ లోకేష్, ఎంపిటిసి సూరాడ రాజారావు పాల్గొన్నారు.

గణనాథుని వేడుకలకు అంతా సిద్ధం

మండపాన్ని సిద్ధం చేసిన నిర్వాహకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గణనాథుని వేడుకలకు శ్రీకాకుళం నగరం యువత సన్నద్ధమవుతున్నారు. నవరాత్రులు పూజలు నిర్వహించనున్నారు. మండపాలు ఏర్పాటు, విగ్రహాలు తీసుకురావటం, వాహనాల్లో తరలింపు వంటి పనుల్లో బిజీగా ఉన్నారు. వర్షాలు విస్తారంగా పడుతున్నా టార్పాలిన్లు కప్పి మరీ విగ్రహాలు తరలిస్తున్నారు. వర్షానికి ఇబ్బంది లేని విధంగా మండపాలు నిర్మిస్తున్నారు. విద్యుత్ కాంతులతో అలంకరిస్తున్నారు. ఏడు రోడ్ల కూడలి, జిటిరోడ్, రైతుబజార్, అరసవెల్లి వంటి ప్రాంతాల్లో ఆకట్టుకునేలా మండపాలు నిర్మించారు. సందడిగా గణపతి నవరాత్రులు నిర్వహణకు యువత సిద్ధమవుతున్నారు.

మార్కెట్లు కలకల

శ్రీకాకుళంలోని పొట్టిశ్రీరాములు పెద్ద మార్కెట్, రైతుబజార్, ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపం, అరసవల్లి కూడలి కలకలాడాయి. పూజా సామగ్రి, పండ్లు వంటివి కొనుగోలుకు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలు వెళ్లారు. గణపతి నవరాత్రుల కల కనిపిస్తుంది.

మెళియాపుట్టి : వినాయక చవితి సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో సందడి నెలకుంది. ప్రతి గ్రామంలోనూ వినాయక విగ్రహాల పూజా కార్యక్రమం నేపథ్యంలో మార్కెట్లు కటకిటలాడాయి. చాపర, మెళియాపుట్టి, గొప్పిలి, వసుంధర, జాడుపల్లి తదితర గ్రామాల్లో జనసందడి నెలకొంది. అలాగే సరిహద్దులో పర్లాకిమిడికి తాకిడి పెరిగింది. ఈ ఏడాది అధిక శాతం యువకులు విగ్రహాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.

వర్షంలోనూ సామగ్రి కొనుగోలుకు వచ్చిన ప్రజానీకం

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టు
S.O.P No: 6/2025

Between:-
ఉరిటి జయదీప్ ......పిటిషనర్
And:-
ది మేనేజర్ ఎల్.ఐ.సి పలాస .....రెస్పాండెంట్

జనరల్ నోటీస్

ఇందుమూలంగా యావన్మంది ప్రజలకు తెలియజేయనది ఏమనగా పైన పేర్కొన్న పిటిషనర్‌ని లేటు ఉమాశంకర్ పట్నాయక్ గారి వారసుడిగా ధ్రువీకరించి వారసత్వ ధృవపత్రం ఇప్పించమని కోరుచూ పై నెంబర్ SOP దాఖలు చేసి యున్నారు. కావున పై పేర్కొన్న పిటిషనర్‌ని ఉరిటి ఉమాశంకర్ పట్నాయక్ గారికి వారసుడుగా ధ్రువీకరించి వారసత్వ ధ్రువపత్రం ఇచ్చుటకు ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్నచో పైన పేర్కొన్న కోర్టు వారి ఎదుట వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా తేదీ **12-09-2025**న హాజరై తమ అభ్యంతరము తెలియపరచవసనదిగా ఈ జనరల్ నోటీస్ పూర్వకంగా యావన్మంది ప్రజానీకానికి తెలియపరచడమైనది.

శ్రీ కోర్టు ద్వారా ఆర్డర్ ప్రకారం ఈ నోటీస్ ప్రసరించడమైనది.

కస్స కామేశ్వరరావు
న్యాయవాది, శ్రీకాకుళం, ఫోన్: 9441050810.

వికలాంగుల ఆవేదన పట్టదా?

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

వికలాంగుల పింఛన్ల కూటమి ప్రభుత్వం ఏరివేత దిశగా ప్రయత్నాలు చేయడంతో వేలాది మంది వేదనకు గురవుతున్నారని ఎమ్మెల్సీ రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్ల ఏరివేతపై మంగళవారం ధ్వజమెత్తారు. వికలాంగులకు వైసిపి అండగా ఉంటూ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వైద్యుల దగ్గర నుంచి ధ్రువపత్రాలు పొంది పింఛను తీసుకున్న వారు ఇప్పుడు ఆరోగ్యవంతులుగా మారిపోయారా? అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు 50 ఏళ్ల వారికి పింఛను ఇస్తామని హామీ నిచ్చారని గుర్తు చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో వికలాంగులు ధర్నా చేసినా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. సమా వేశంలో మాజీ ఎంపిపి కారింగ మోహనరావు, బాకి లక్ష్మీనారాయన పాల్గొన్నారు.

కంప్యూటర్‌పై శిక్షణ

టెక్కలి రూరల్: ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ ఆఫ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విద్యార్థులకు అతిథి అధ్యాపకులు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా యుఎస్‌కు చెందిన మని తోబా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ పెడద, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ వంటి ఉపాధి కోర్స్‌ల్లో, వ్యాపార, ఉద్యోగ రంగాల్లో విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎలా ఎదగాలి అన్న అంశంపై పలు ప్రయోగాత్మకమైన అంశాలపై వివరించారు.. ఈ శిక్షణాలో డైరెక్టర్ ప్రొఫెషర్ వి.వి.నాగేశ్వరావు పాల్గొని మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు నరేష్ తంగుడు, ప్రియాంక పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

మాట్లాడుతున్న జూనియర్ జడ్జి వాణి

కోటబొమ్మాళి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అన్నారు. ఆమె మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఆడ పిల్లకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాలు పూర్తి కాకుండా వివాహం చేసినట్లయితే రెండేళ్ల జైలు శిక్ష, జరిమానాలు ఉన్నాయని అమె తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజరు పద్మావతి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లఖినేని శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు పి.అర్జునరావు, పి.వాసుదేవరావు పాల్గొన్నారు.

పలాస: బాల్య వివాహాలు నిర్మూలించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి, సీనియర్ న్యాయవాది కామేశ్వరరావు పట్నాయక్ అన్నారు. డిగ్రీ కళాశాలలో జూనియర్ సివిల్ జడ్జి మాధురి ఆదేశాల మేరకు మండల న్యాయ సంఘం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే న్యాయ విజ్ఞాన సదస్సుపై అవగాహన పెంచు కోవాలన్నారు. ఎక్కడ అన్యాయం జరిగిన ప్రశ్నించే తత్వం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్ రాజ్, వాకాడ రవి తదితరులు పాల్గొన్నారు.

కవిటిలో కార్డాన్‌సెర్చ్

ప్రజాశక్తి- కవిటి

తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ రవివర్మ

కవిటి పట్టణం లోని న్యూ కాలనీలో మంగళ వారం తెల్లవారు జామున పోలీసులు విస్తృతంగా కార్డాన్‌సెర్చ్ ఆపరే షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, మత్తు పదార్థాల వాడకం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై కఠిన నిఘా ఉంచాలని పోలీసులు హెచ్చరించారు. కొత్తగా ప్రాంతంలోకి వచ్చిన అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. వాహనాలు తప్పనిసరిగా సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం ఎస్ఐ వి రవివర్మ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనపడితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలందరూ ఆనందంగా, ఎటువంటి గొడవలు లేకుండా శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వర్షాలతో రైతులకు మేలు

ప్రజాశక్తి- సోంపేట

ఆగస్టు రెండు, మూడు వారాల్లో వర్షించిన 130 మిల్లీమీటర్ల వర్షం మండలం రైతులకు ఎంతో మేలు చేసిందని వ్యవసాయ శాఖ ఎడి ఎ.భవాని శంకర్ అన్నారు. మండలంలోనీ సుంకిడి, శారదాపురం గ్రామాల్లో వ్యవసాయ అధికారి బి.నరసింహమూర్తితో కలిసి మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు ఇచ్చారు. వరి పంటకు ఒక్క యూరియాతోనే పోషించడం పర్యావరణానికి, మానవాలి ఆరోగ్యానికి పరోక్షంగా హాని చేయడమేనని అన్నారు. నత్రజని సూటి ఎరువు యూరియా అవసరమైన మేరకు మాత్రమే ఉపయోగించి పంటకు కావాల్సిన భాస్వరం, పొటాస్ కూడా సమపాలల్లో సిఫార్సు మేరకు అందిస్తే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. ఇప్పటివరకు మండలంలో సాగైన 6,400 ఎకరాలకు పూర్తి విస్తీర్ణానికి డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు అందించ గలిగామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు దుర్యోధన, భాస్కరరావు, అప్పలస్వామి, వ్యవసాయ సహాయకులు ధనలక్ష్మి, చరణ్ పాల్గొన్నారు.

వేద గణితం పోటీలో ప్రతిభ

నరసన్నపేట: భారతీయ విద్యా కేంద్రం వారి విజ్ఞాన భారతి నరసన్నపేట పాఠశాల విద్యార్థులు వేద గణితం పోటీలలో సమితి (6 జిల్లాలు) స్థాయిలో ద్వితీయ స్థానాన్ని పొందారని కరస్పాండెంట్ డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీలు ఇటీవల విశాఖపట్నంలో వేద గణితం నిర్వహించగా, మా పాఠశాల నుంచి పోటీలో పాల్గొన్న పొట్నూరు నవనీత్ సత్యసాయి, డొంకన లికిత్ చంద్ర, ముంగురుహర్షిత్ సుబ్రమణ్యం విద్యార్థుల ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులకు భారతీయ విద్యా కేంద్రం కార్యదర్శి వి.రామ సత్యనారాయణ, కోశాధికారి వై.శ్రీధర్, డైరెక్టర్ బి.లక్ష్మీనారాయణ, బి.నారాయణరావు, డి.రాజశేఖర్ ప్రబంధ కారినికమిటీ అధ్యక్షులు నానాజీ గాడ్గే, ప్రధానోపాధ్యాయులు ఢిల్లేశ్వరరావు, సైక్షనిక్ ప్రముఖ అనిల్, వేద గణిత ఉపాధ్యాయులు శైలజ, ఉపాధ్యాయులు శ్రీదేవి, హేమకుమారి, అరుణ, అనురాధ, సూర్యనారాయణ, అంజలి అభినందనలు తెలిపారు.

క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు

ఇచ్ఛాపురం: జిల్లా క్రికెట్ సంఘం. ఆధ్వర్యంలో సురంగి రాజా క్రీడా మైదానం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు తెలిపారు. మంగళవారం జిల్లా క్రికెట్ సంఘం ముఖ్య పర్యవేక్షకులు ఇలియాస్ మహమ్మద్ పర్యవేక్షణలో జిల్లా క్రికెట్ సంఘం సహాయ కార్యదర్శి నగిరి బెనర్జీ ఆధ్వర్యంలో ఐసిసి క్రికెట్ క్లబ్ ప్రతినిధులు ఎమ్మెల్యే బెందాళం. అశోక్, దాసరి రాజుని సంప్రదించారు. ఈ సందర్భంగా రాజు జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.సురేష్‌కు మైదానం అభివృద్ధి ఎంఒయుకు నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో బత్తుల వెంకటరమణ, సాలిన గణేష్, ఇచ్ఛాపురం ఐసిసి క్రికెట్ క్లబ్ కోచ్ దక్కత గోపి, దట్టి ఈశ్వరరావు, క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళా అధ్యక్షురాలిగా దేవికా జెన్నా

కవిట: టిడిపి అనుబంధ కమిటీల నియామకంలో భాగంగా మండల తెలుగు మహిళా అధ్యక్షురాలిగా దేవికా జెన్నా, ప్రధాన కార్యదర్శిగా కోరాడ లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు తెలిపారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదేశాల మేరకు మంగళవారం ఈ ఎన్నిక జరిపినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం సిటీ : మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణని కేంద్ర పౌర విమానాయాశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద మట్టి వినాయక ప్రతిమలను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, మట్టి గణేశ ప్రతిమల వినియోగమే కాలుష్య రహిత సమాజానికి మార్గమని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సహజ మట్టితోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. గత పదేళ్లుగా ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందిస్తున్నామని, ఈ ఏడాది పర్యావరణ శాఖ, క్రెడై సహకారంతో 30 వేలకు పైగా ప్రతిమలు, వ్రత పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. 'మట్టి వినాయకున్ని పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో సాగుతున్నామని, నాగావళి, వంశధార వంటి జీవనదులను కాపాడుకోవడం అందరి బాధ్యతన్నారు.

ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ఆధ్వర్యంలో పంపిణీ...

పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలను పూజించాలని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని క్రిస్టల్ ప్యాలెస్ ఆవరణలో 500 వినాయక మట్టి విగ్రహాలను మంగళవారం పంపిణీ చేశారు.

మహిళా కళాశాల ఆధ్వర్యంలో

ప్రభుత్వ మహిళా కళాశాలలో గణితశాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని విగ్రహాల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సౌజన్యంతో నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ నారాయణ స్కూల్ యాజమాన్యం వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. హరిత ఫౌండేషన్ సభ్యులు హరిబాబు, తవిటి నాయుడు, పాఠశాల డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ గోవింద, ప్రిన్సిపాల్ గౌరునాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: మండలంలోని చాకిపల్లి కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను తయారుచేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధ, ఉపాధ్యాయులు తమ్మినేని వైకుంఠరావు, కె.నారాయణ, సుధారాణి, బి.నారాయణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోంపేట: సోంపేట లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆవరణలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఇ.లక్ష్మీనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు వి.గోపి కిరణ్, ప్రతినిధులు క్రాంతి, శ్రీరామ్, కృష్ణారావు, పింటూ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: దండు గోపాలపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మట్టి విగ్రహాల తయారీ కార్యక్రమం నిర్వహించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు బి.శ్రీనివాస్, ఆర్.అన్నాజీ శిక్షణలో 214 మంది విద్యార్థులు 72 మట్టి విగ్రహాలను తయారు చేశారు. మట్టి విగ్రహాలను మాత్రమే పూజలో వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కరరావు, తిరుపతిరావు, జె.శ్రీనివాసరావు, సూర్యప్రకాష్, నాగేశ్వరరావు, శారదాంబ, లక్ష్మీనారాయణ, మురళీధరరాజు, రాము, ఉమ, పి.శ్రీధర్, విజయలక్ష్మి, డి.శ్రీనివాసరావు, దయాసాగర్, శ్రీధర్, మార్కండేయులు పాల్గొన్నారు.

పలాస: ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇండియన్ రెడ్‌క్రాస్ క్లబ్, ఎకో క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 250 మట్టి గణపతి ప్రతిమలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, ఐక్యూ ఎసి కో-ఆర్డినేటర్ పి.వెంకటరమణ, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మధు, లైబ్రరీ నరసింహులు, సైన్స్ విభాగ అధ్యక్షులు శ్రీనివాస్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో గ్లో సంస్థ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్య నారాయణ, సవర రాంబాబు, బి నాగరాజు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్ అన్నారు. నిత్యం మీకోసం సేవా సంఘం, జిల్లా జనసేన కార్యదర్శి వడ్డాది శ్రీనివాసరావు, సోదరుడు శంకరరావు ఆర్థికసాయంతో పైడి భీమవరం పారిశ్రామిక వాడలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయల్ మేక్ రమణ, పైడి భీమవరం ఆర్యవైశ్య సంఘం నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక సిఎంఆర్ జంక్షన్ దగ్గర ప్లాటినం 22 గుడ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. సుమారు 500 వినాయక ప్రతిమలు పంపిణీ చేసినట్లు అధ్యక్షుడు సింగూరు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ తంగుడు విజయ్ కుమార్, సెక్రటరీ వారణాసి బుజ్జి, ట్రెజరర్ నూలి సురేష్ కుమార్, గుడ్ ఫ్రెండ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వి.టి.చౌదరి, అసిస్టెంట్ గవర్నర్ ఎస్.రాజా, సభ్యులు కె.సంజీవరావు, చాపర విజయలక్ష్మి, పొన్నాడ రోషిణి, బుడుమూరు సూర్యారావు, బగాది భాస్కరరావు, సత్యసాయి ఆర్గనైజర్ కరకవలస ప్రహ్లాదరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. వ్యాపారవేత్త, రోటరీ క్లబ్ ప్రతినిది పైడిశెట్టి దినేష్ కుమార్ ఆధ్వర్యాన 400 మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. టిడిపి వార్డు కౌన్సిలర్ లీలారాణి, రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ మోహన్, వెంకటేష్, కృష్ణమూర్తిరెడ్డి, పాక తులసీదాస్, గోపీచౌదరి, గోపాల్, ఫ్రపుల్ల, నవీన్, వి.కె.ప్రసాద్, కె.రామారావు పాల్గొన్నారు.

టెక్కలి: పర్యావరణపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని నర్సింగపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉత్తరకవాటం గణపతిరావు అన్నారు. పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల తయారీపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన విగ్రహాలతో ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయులు డొంకన పాపారావు, సంపల్లి చిన్నవాడు, వెంకటరమణ, హైమావతి, నరసమ్మ, వాసుదేవరావు, వై.వి.రమణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని సింహాద్రిపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. మట్టి విగ్రహాలను పూజించాలని హెచ్ఎం నారాయణరావు విద్యార్థులకు సూచించారు.

వినాయకుని ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు

వినాయకుని రూపంలో విద్యార్థులు

పలాస: మండలం సత్యసాయి విద్యా విహార్‌లో వినాయక చవితి సందర్భంగా మంగళవారం విద్యార్థులు వినాయకుడు ఆకృతిలో కూర్చొని ప్రదర్శించారు. ఈ ప్రదర్శన పిఇటిలు కిరణ్, గుర్నాథ్‌ల పర్యవేక్షణలో జరగ్గా విద్యార్థులను, పిఇటిలను ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎరువుల కొరత తీర్చాలి

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలిలో ఎరువుల కొరతకు బాధ్యులను గుర్తించి అక్రమంగా ఎరువులు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకొని ఎరువుల కొరతను అధిగమించాలని మాజీ నీటి సంఘం అధ్యక్షులు సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చం నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఎరువుల కొరత రాకుండా ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షించి అవసరమైన ఎరువులు రప్పించేందుకు కృషి చేయడం అభినంద నీయమన్నారు. అయితే అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు తమ స్వార్థం కోసం కృత్రిమ కొరతని సృష్టిస్తున్నారన్నారు. అదేవిధంగా ఎరువుల వ్యాపారులతో కుమ్మక్కై తమకు అనుకూలమైన రైతులకు ఎరువులు అందజేయించి మిగిలిన వారిపై వివక్ష చూపడం తగదన్నారు. దీనిపై సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు నిష్పక్షపాతంగా వ్యవహరించి అవసరమైన ప్రతి రైతుకు ఎరువులు అందించేలా కృషి చేయాలని కోరారు.

పారదర్శకంగా మెగా డిఎస్‌సి

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాతే పారదర్శకంగా 16,347 టీచర్ పోస్టులతో మెగా డిఎస్‌సి నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ ఉపాధ్యాయులు ఎన్నోఏళ్లగా ఎదురుచూస్తున్న వారికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఇకపై ప్రతిఏటా డిఎస్‌సి నిర్వహించి విద్యారంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెట్టడానికి కూటమి ప్రభుత్వం సంకల్పంతో ఉందన్నారు. యువనేత లోకేష్ అధ్వర్యంలో విద్యా ప్రమాణాలు మెరుగుకు అనేక సంస్కరణలు తీసుకు వచ్చారన్నారు. 2014లో 8,926, 2018లో 7254, 2019లో 521 ఉపాధ్యాయ పోస్టులను నియమించడం జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఉపాధ్యాయ పోస్టులు నియమకం ఊసే ఎత్తలేదని, మరలా 2025లో 16,347 పోస్టులను కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో భర్తీ చేయడం గర్వంగా ఉందన్నారు.

బ్లాక్ బోర్డుల వితరణ

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బి.గొనపపుట్టుగ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి షణ్ముఖరావు కుమారుడు లోల్ల శివసాయి రూ.5 వేలు విలువచేసే ఐదు బ్లాక్ బోర్డులను మంగళవారం పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం వీరభద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వ పిలుపు మేరకు పాఠశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం బాబూరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండి పుట్టుగలో...

కొండిపుట్టుగ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్తు సోమేశ్వరరావు, ఇంటెనుక పాపారావులు తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు ఐడి కార్డులు, నోటు పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో పిఎంసి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరాలో విఫలం

నరసన్నపేట : రైతులకు ఎరువుల సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుగాలం శ్రమటోడ్చి కష్టపడి పొలంలో పనిచేయాల్సిన రైతన్నలు రోడ్లెక్కి ఎరువుల కోసం ఎదురు చూపులు చూస్తున్నారని అన్నారు. ఒక్క బస్తా అయినా దొరుకుతుందా? లేదా? అని దుకాణాల ముందు పడిగాపులు కాయాల్సి వస్తోందన్నారు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతల దౌర్భాగ్యమైన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదన్నారు. జగనన్న పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు అందజేశామని గుర్తు చేశారు.

మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- లావేరు

నోబుల్ గ్రహీత భారతరత్న మదర్ థెరీసా జయంతి కార్యక్రమం మంగళవారం లావేరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూల మాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను గ్రంథాలంము తరుపున అందజేశారు. కార్యక్రమంలో లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ నీలిమా, ప్రిన్సిపాల్ బాలరాజు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి: కవిటి పట్టణంలోని కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం మదర్ థెరీసా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఎఒ రాణి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పేదల పెన్నిధి మదర్ థెరీసా ఆశయాలను విద్యార్థులు అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంబిరిగాం శ్మశాన భూముల పరిశీలన

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి- పలాస

శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

మండలం కంబిరిగాంకు చెందిన చౌదరి కుటుంబానికి చెందిన సర్వే నెం 33/1లో వివాదాస్పదంగా మారిన స్మశాన భూముల వ్యవహారంపై తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, సర్వేయర్ గిరి, ఆర్ఐ ప్రసాద్‌లు స్మశాన వాటిక స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం 'వివాదాల సుడిలో స్మశాన భూమి' అనే శీర్షికతో వెలువడిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. అనంతరం రెవెన్యూ అధికారులు తొలిగించిన సమాదులు ప్రాంతం, స్మశాన వాటిక బోర్డులు నేలకొరిగిన తీరును పరిశీలించారు. అనంతరం స్థలం కొనుగోలు చేసిన పలాసకు చెందిన వ్యాపారి కోరాడ శ్రీనివాసరావును తహశీల్దార్ పిలిపించి దీనిపై విచారణ చేపట్టారు. చౌదరి వద్ద నుంచి స్మశాన వాటిక కొనుగోలు వ్యవహారం, దీనిపై పలుమార్లు జరిగిన వివాదాలపై అరా తీశారు. అంతే కాకుండా ఎంత స్థలానికి పన్నులు చెల్లించారు. తదితర వివరాలను తమకు అందించాలని తహశీల్దార్ అదేశించారు. చౌదరి నుంచి స్థలం కొనుగోలు చేసిన కోరాడ శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ తాము చౌదరి కుటుంబీకుల నుంచి ఈ స్థలం కొనుగోలు చేసి అభివృద్ధి చేసుకుంటున్న తరుణంలో ఈ స్థలంపై కాశీబుగ్గకు చెందిన మరో వ్యాపారి పెంట ఉదయ శంకర్ కొంత మందికి రెచ్చగొట్టి ఈ స్థలంపై లేని పోని వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. గతంలో పెంట ఉదయ శంకర్‌కు తమకు ఉన్న వివాదాలను దృష్టిలో పెట్టుకొని ఈ స్థలంపై వివాదాలు సృష్టిస్తున్నారని, గతంలో కూడా స్మశాన వాటికలో శిలాఫలకాలను తామే ధ్వంసం చేసినట్లు సృష్టించి తమకు పోలీస్‌స్టేషన్‌కు లాగిన సంఘట నలు ఉన్నాయన్నారు. చౌదరి కుటుంబీకులు సమ్మతితో ఈ స్థలం కొనుగోలు, అన్ని హక్కులు పొందినప్పటికీ తమపై లేనిపోని ఆరోపణలు చేసి తమ ప్రతిష్టను దెబ్బతీసేందుకు అధికార పార్టీలో ఉన్న ఉదయశంకర్ ఇటువంటివి చేపట్టడం సరికాదని, ఇదే పరిస్థితి కొనసాగితే ఉదయ్‌శంకర్ బాగోతాలు బయట పెడతామని హెచ్చరించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

లావేరు : స్మార్ట్ రైస్ కార్డులు అందజేస్తున్న తోటయ్యదొర, నాయకులు

ప్రజాశక్తి- లావేరు

ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రైస్ కార్డులతో రాష్ట్రంలో నచ్చిన చోట నుంచి రేషన్ సరుకులు తీసుకోవచ్చునని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర అన్నారు. మంగళవారం లావేరులో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాలలో పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం ఈ కార్డులను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ రమేష్, మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, మాజీ జెడ్‌పిటిసి ఎన్.త్రినాథ్, కూటమి నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, ఆనంద్, గండి సురేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాళ్లవలసలో టిడిపి మహిళా రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి సుజాత కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముప్పుడి మురళీ పాల్గొన్నారు.

నరసన్నపేట: సత్యవరం గ్రామంలో నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలకు పంపిణి చేశారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ రొనంకి కృష్ణం నాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షులు కింజరాపు రామారావు, తెలుగుయువత సభ్యులు రావాడ గణపతి, అధికారులు, నాయకులు మావుడూరు జగదీష్‌బాబు, మెండ నరసింహులు, చీపురు జగదీష్, బెందాలం రామకృష్ణ, గున్న కామేష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ సరుకులను పారదర్శకంగా అందించాలని లక్ష్యంతోనే ప్రభుత్వం స్మార్ట్ కార్డులను తీసుకొచ్చిందని ఎఎంసి డైరెక్టర్ పడాల శ్రీను అన్నారు. మండలంలోని చాపరలో ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు లబ్ధిదారులకు స్మార్ట్ రైస్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ తేజరో స్వామి, విద్యా కమిటీ మాజీ చైర్మన్ దారపు దామోదర్, కొల్ల ధర్మారావు, బత్తల శ్రీను, మజ్జి పోలినాయుడు, రాము, తిరుపతిరావు, చంద్రశేఖర్, నాగార్జున, నాగభూషణం పాల్గొన్నారు.

మండలస్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా ఎంపికలు

మాట్లాడుతున్న ఎంఇఒ విశ్వనాథం

ఇచ్ఛాపురం: సెప్టెంబర్ ఒకటి, రెండు తేదీల్లో మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా ఎంపి కలు నిర్వహించడం జరుగుతుందని ఎంఇఒ-2 ఎస్.విశ్వనాథం అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఇఒ అధ్యక్షత ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. 1న ఈదు పురంలో కబడ్డీ, వాలీబాల్, యోగా, బ్యాడ్మింటన్, 2న జడ్‌పిహెచ్ఎస్ లొద్దపుట్టి పాఠశాలలో ఖోఖో, చెస్, అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలకు క్రీడా ఎంపికలు నిర్వహిస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయ అధ్యక్షుడు కె.పద్మనాభరెడ్డి, ఎంఎస్ఒ కష్ణపుడియ, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం

కవిటి: కవిటిలో దాతల సహాయంతో నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ప్రగడపుట్టుగకు చెందిన విశ్రాంత మెడికల్ అధికారి పిరియా కృష్ణారావు రూ.1,11,116లు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బిపి రెడ్డి, మొగలిపురి సీతారాం, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, పొల్లాయి రుద్రయ్య తదితరులు మాట్లాడారు. ఆరింగి త్రివిక్రమరావు, మార్పు అప్పలరాజు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఢిల్లీశ్వరరావు, భావన రవి, అనుపోజు తారకేశ్వరరావు పాల్గొన్నారు.

చెక్కు అందిస్తున్న కృష్ణారావు

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న డిఎస్‌పి లక్ష్మణరావు

మండపాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల ఏర్పాటుకు ఉత్సవాల నిర్వహణకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డిఎస్‌పి డి.లక్ష్మణరావు స్పష్టం చేశారు. మంగళవారం మండపాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతోంం మాట్లాడారు. బలవంతపు చందాలు వసూలు చేయరాదన్నారు. దర్శనాలకు టికెట్లు పెట్టకూడదని, అటువంటి చర్యలకు పాల్పడితే డైల్ 100 ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కృత్రిమ రంగుల ఉపయోగించిన విగ్రహాలను కొనుగోలు చేయవద్దని, మట్టితో తయారు చేసిన విగ్రహాన్ని పూజించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విగ్రహం సైజు, ఉత్సవం ఎన్ని రోజులు నిర్వహిస్తారు, నిమజ్జనం చేసే తేదీ కమిటీ సభ్యుల వివరాలను ముందుగానే పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు. మండపాలు దగ్గర సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోజూ రాత్రి కమిటీ సభ్యులు విగ్రహాల వద్ద బస చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలన్నారు. గణేష్ మండపాల అనుమతులకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈయనతో పాటు సిఐ అంబటి విజయకుమార్, ఎస్ఐ రఘువందనరావు సిబ్బంది ఉన్నారు.

ఆమదాలవలస: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించు కోవాలని సిఐ పి. సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని కమిటీ సభ్యులతో సమావేశమైన ఆయన మాట్లాడారు. మండపాలు ఏర్పాటు చేసేముందు తప్పనిసరిగా పోలీస్ అనుమతి పొందాలన్నారు. ఫైర్, మున్సిపల్, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకుని భద్రతా చర్యలను ఖచ్చితంగా పాటించాలన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు, డిజె లను వాడరాదన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కోటబొమ్మాళి: మండలంలోని బంజీరుపేటకు చెందిన సిమ్మ సింహాచలం (59) నిద్రమాత్రలు మింగి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈనెల 22న నిద్ర మాత్రలు మింగటం గుర్తించిన భార్య సిమ్మ వరలక్ష్మి వెంటనే స్థానిక 108కులో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడి భార్య వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత జెఇ మృతి

ప్రజాశకి - కవిటి

భగీరథి దలై (ఫైల్)

మండలంలోని బొరివంకకు చెందిన విశ్రాంత పిఆర్ జెఇ భగీరథి దలై సోమవారం రాత్రి మరణించారు. ఆరు నెలల క్రితమే ఉద్యోగ విరమణ చేసిన భగీరథి దలై గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడ్డారు. ఇటీవల మళ్లీ ఆరోగ్యం క్షీణిస్తే విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కన్ను మూశారు. ఆయనకు భార్య భాను దలై, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బెంతు ఒరియాలకు పెద్ద దిక్కుగా ఉన్న భగీరథి దలై మరణంతో వారు పెద్ద దిక్కును కోల్పోయినట్లైంది. భగీరథి దలై మృతిపై సర్పంచ్ బెందాళం శ్రీరామ్‌ప్రసాద్, ఎంపిటిసి దుద్ది సతీష్, ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయ కృష్ణ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మృతి చెందిన పాడి ఆవు

మండలంలోని మునగ వలసలో మంగళ వారం ఉదయం విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందింది. అలికాం, బత్తిలి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న నాయి బ్రాహ్మణ షాపుకు గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో విద్యుత్ సరఫరా నిలిచింది. గ్రామానికి చెందిన కనమట చిన్నప్పన్న అనే రైతుకు చెందిన ఆవు మేత కోసం నాయి బ్రాహ్మణ షాపు వైపు వెళ్లగా విద్యుత్ వైర్లు తెగిపడి ఉండడంతో ఆవు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత పాడి రైతు తెలిపారు. సుమారు రూ.40 వేలు విలువ చేసే ఆవు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో పాడి రైతు కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు.

రాజేష్‌కు మాతృ వియోగం

కవిటి: కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోళ్ల రాజేష్‌కు మాతృవియోగం కలిగింది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజేష్ తల్లి లోళ్ల కృష్ణవేణమ్మ మంగళవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు.

దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న రసాయన శాస్త్రం, కంప్యూటర్ అప్లికేషన్ సబ్జెక్టుల బోధనకు గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌సి పిజిలో 57 మార్కులు సాధించి ఉండాలన్నారు. అదేవిధంగా జాతీయస్థాయిలో నిర్వహించిన టెట్ ఎగ్జామ్స్‌లో అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ నెల 30లోగా దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలన

కొత్తూరు : అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అధికారులు తగుచర్యలు చేపడు తున్నారు. ఈ సందర్భంగా మండలంలోని నివగాంలో మంగళవారం పారిశుధ్య పనులను ఇఒపిఆర్‌డి కె.వసంతకుమారి పరిశీలించారు. ఈ మేరకు పారిశు ధ్య కార్మికులకు తగు సూచనలు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు తేజం పురస్కారానికి 'తెప్పల' ఎంపిక

పలాస: అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని ప్రముఖ కవి, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డా.తెప్పల కృష్ణమూర్తి చేస్తున్న తెలుగు సాహిత్య సేవలను గుర్తించి తెలుగు భాషా పరిరక్షణలో తన కృషికి గుర్తింపుగా పల్నాడు జిల్లా నరసారావు పేటలో ఈనెల 31న జరిగే తెలుగు భాషా దినోత్సవ సంబరాల్లో తెలుగు తేజం పురస్కారానికి ఎంపిక చేసినట్లు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్ నుంచి ఆహ్వానం అందినట్లు కృష్ణమూర్తి తెలిపారు.